క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



కన్నాయిగూడెం: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కన్నాయిగూడెం వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్ నాయకులతో కలిసి కలెక్టర్ కృష్ణ ఆదిత్యకు గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఏజెన్సీ ప్రాంతాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదని భూపతిపురం, చిట్యాల, సర్వాయి, ఐలాపూర్, కంతనపల్లి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలకు పూర్తి ఆర్టీసీ సౌకర్యంతో పాటు ఎమర్జెన్సీ సేవలు అందడం లేదని కలెక్టర్‌కు వివరించారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న అన్ని శాఖల అధికారులు సమయపాలన పాటించడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నిధులు కేటాయించాలని కోరారు. ఆలం రాంబాబు, జాడి రాంబాబు పాల్గొన్నారు.

కవిత జన్మదిన వేడుకలు



ములుగు: జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పోరిక రవీందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందుకు బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోగిల మహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్, బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, లింగాల రమణారెడ్డి, సాయిబాబా, మల్లయ్య, వేణు, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, ఎంపీటీసీల ఫోరంజిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రాం నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



ఏటూరునాగారం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కేజీబీవీ జీసీడీఓ రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే కళాశాలలోని తరగతి గదులు తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఈనెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని, వాటిని విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. పదో తరగతి విద్యార్థులు 10/10 జీపీఏ సాధించాలని కోరారు. ఆమె వెంట కేజీబీవీ ఎస్‌ఓ పీవై లక్ష్మి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు.

పరామర్శ



ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన బానోత్ సోమునాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ సోమవారం పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సాయికుమార్, సర్పంచ్ వాణి రాజు, నరసింహ, శ్రీరాంరెడ్డి, వెంకట్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

చిట్యాల: తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాలకు చెందిన గుర్రపు గట్టయ్య సోమవారం ఉదయం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా కాలు జారి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో తోటి గీత కార్మికులు చూసి గట్టయ్యను స్థానిక సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని నడుముకు, పక్కటేముకలకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి నిమ్స్ ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించారు.

‘కల్యాణలక్ష్మి’ని సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ జగదీశ్, ఎమ్మెల్యే సీతక్క

ములుగు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్ అధ్యక్షతన సోమవారం వారు 81 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ జగదీశ్ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డ తల్లితండ్రులకు భారం కాకూడదని సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పేదవాడికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రాంనాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ రిలీఫ్‌ఫండ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో పలు విధాలుగా నష్టపోయిన గిరిజన కుటుంబాలకు ఐటీడీఏ ద్వారా ట్రైబల్ రిలీఫ్ ఫండ్ చెక్కులను ఐటీడీఏ పీఓ అంకిత్ తన కార్యాలయంలో సోమవారం బాధితులకు అందజేశారు. తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన సిద్దబోయిన లక్ష్మణ్‌రావు తన కోళ్ల ఫాం వల్ల కోళ్ల మృతి చెందడం నష్టపరిహారం కింద రూ.25వేల చెక్కును అందజేశారు. అలాగే తాడ్వాయి మండలం కన్నెపల్లికి చెందిన గొంది రాజు ఇల్లు కాలిపోయినందుకు, ఖానాపురం మండలం కొత్తూరు జవహర్‌లాల్ కుమార్తెకు, చల్వాయికి చెందిన అల్లం స్వాతి కుటుంబానికి, మంగపేట మండలం ఓడగూడెంవాసం నాగేష్ కుటుంబానికి, ములుగు మండలం రాంసింగ్‌తండాకు చెందిన జెర్పుల అనూన్య కుటుంబానికి ఒక్కో కుటుంబానికి రూ.25వేల చెక్కును అందజేశారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి



ములుగు రూరల్: ఫిర్యాదు చేస్తున్న నాయకులు



వెంకటాపురం(ఎం)లో..

ములుగు రూరల్: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన బీఆర్‌ఎస్ నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై కేసు నమోదు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఓంకార్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలను మానుకోవాలని లేని పక్షంలో తెలంగాణ ప్రజలు బుద్ధి చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ బలరాం, వాసుదేవరెడ్డి, కొత్త సురేందర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి

వెంకటాపురం(ఎం): మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నకిరేకల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన సీఎం కేసీఆర్ దేశాన్ని అధోగతి పాలు చేసేందుకు బీఆర్‌ఎస్ పేరుతో కొత్త నాటకాలకు తెరలేపారని అన్నారు. అందులో భాగంగా పిచ్చి పట్టిన ఎమ్మెల్యేలు, మానవత్వం తెలియని విధంగా మాట్లాడుతున్న తీరును తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారుపోతుల యాదగిరి గౌడ్, ప్రధాన కార్యదర్శి సాంబరాజు, కిరణ్, కొత్త వీరస్వామి, ధరంసోత్ ప్రేమ్ సింగ్, కాసర్ల సురేష్, పిట్టల సాంబయ్య, ఓదెల రాజేందర్, పత్తి నాగేశ్వరరావు, పైడాకుల మల్లేష్, తంగేళ్లపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడులు నిర్వహిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని 8వ వార్డు సమీపంలో గాడిచర్ల పీరయ్య, గాడిచర్ల నారాయణ అనే ఇద్దరు వ్యక్తుల ఇంటి సమీపంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈదాడుల్లో 20 లీటర్ల గుడుంబా, 1200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్ల పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సందీప్, నవీన్, తిరుపతి, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

ములుగు రూరల్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలంలోని బండారుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ శోభరాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన ఏడుగురు విద్యార్థులను ఆమె అభినందించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పోరిక దర్శిత, పొడాల మణిదీప్, అగ్గిమెట్ల విశాల్, రుత్విక్, సాయిచరణ్, దీక్ష, శ్రీకర్ ఎంపికయ్యారని అన్నారు.

నాగులమ్మను దర్శించుకున్న జెడ్పీ చైర్మన్



నాగులమ్మను దర్శించుకుంటున్న నాయకులు

మంగపేట: మండలంలోని వాగుడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపురం శ్రీ నాగులమ్మ ఆలయంలో కొలువుదీరిన నాగులమ్మ అమ్మవారిని ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ దర్శించుకున్నారు. సోమవారం మండలంలో పర్యటించిన ఆయన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు వత్సవాయి శ్రీధర్‌వర్మ, ఎఫ్‌ఎస్‌సీ చైర్మన్ తోట రమేష్‌తో మండల పార్టీ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడు కుడుముల లక్ష్మినారాయణ, ఎఫ్ఎస్‌సీ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, మండల నాయకులు నర్సింహారావు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన బీజేపీ



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేయడంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ ఆరోపించారు. మాదిగల సంగ్రామ పాదయాత్ర మండలంలోని కాటాపూర్ గ్రామానికి సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాట్లాడుతూ.. దేశంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మాదిగలను, ఉపకులాలను మోసం చేసిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకపోవడంతో విద్య, ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మాదిగలను మోసం చేసిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోతాయని, బీజేపీకి కూడా అదే గతి పడుతుందని అన్నారు. బీజేపీ మీద జరుగబోయే యుద్ధానికి మాదిగలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 4న హైదారాబాద్‌లో నిర్వహించనున్న సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ పుల్లూరు కరుణాకర్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ జిల్లా కన్వీనర్ వాసంపల్లి చైతన్య, సురేష్, వాసంపల్లి నర్సింగరావు, మబ్బు నవీన్ పుల్లూరి నరసింహ లంజపల్లి ఆది, దామర స్వామి, పుల్లూరు చిన్న కరుణాకర్, పుల్లూరు శ్రీకాంత్ ,మబ్బు సురేష్, పల్నాటి కృష్ణ, సతీష్ వాసంపల్లి ఈశ్వర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ఏటూరునాగారం: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు ఎంపెల్లి రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు కార్మికులు, బీఎస్పీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. కార్మికులకు జీతాలు రాక కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. ఇటీవలే కామారెడ్డి జిల్లా బీబీపేట గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కొంగారి బాబు జీపీ కార్యాలయంలోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. కొంగారి బాబు భార్య గర్భిణీగా ఉందని జీతం లేక అల్లాడిపోయిన ఆయన తీవ్ర మనస్థాపనతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉరివేసుకొని చనిపోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బాబు కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వావిలాల కిషోర్, స్రవంత్, సాగర్, ప్రణీత్, గ్రామపంచాయతీ సిబ్బంది మామిడి రాంబాబు, వావిలాల లక్ష్మణ్, చింతం చింటు, అనిల్, మినాజ్ పాల్గొన్నారు.

సర్వర్ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

ములుగు రూరల్: పేద రైతుల అభ్యున్నతికి జీవితాన్ని త్యాగం చేసిన ఎండీ సర్వర్ జయంతి వేడుకలు మండలంలోని రాంచంద్రాపూర్‌లోని సర్వర్ స్మారక స్థూపం వద్ద సర్వర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు, ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. సర్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీడిత ప్రజల విముక్తికి సర్వర్ అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. చారిటబుల్ ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లడుతున్న సూడి కృష్ణారెడ్డి

వెంకటాపురం(కె): సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 19న మండలంలో నిర్వహించనున్న జన చైతన్య యాత్రను జయప్రదం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న యాత్రను కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యావసర సరుకులు, గ్యాస్ రేట్లను పెంచుతు సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారని అన్నారు. ఉపాధిహామీ పనులకు ప్రతీ సంవత్సరం రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, పని దినాలు 200కు పెంచి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యానం వాసు, వంకా రాములు, గుండుమల్ల ప్రసాద్, పర్శిక రాంబాబు, కట్ల నర్సింహాచారి, మాణిక్యం, పోషాలు తదితరులు ఉన్నారు.

సాగునీరు అందించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: ములుగు మండలంలోని లక్నవరం లోతట్టు గ్రామాలైన కన్నాయిగూడెం, రాయినిగూడెం, పెగడపల్లి, సర్వాపూర్, అంకన్నగూడెం గ్రామాలకు సాగునీరు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ అమ్జద్‌పాషా సోమవారం అదనపు కలెక్టర్ వైవి గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్జద్‌పాషా మాట్లాడుతూ.. లోతట్టు గ్రామాల రైతుల సాగు భూములు వర్షాకాలంలో లక్నవరం ముంపునకు గురవుతున్నాయని యాసంగి సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో పాటు మండలంలోని పొట్లాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంచి నీటి సమస్యను తీర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఎండీ గఫూర్, చీడం మహేందర్, రామన్న, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మిదేవిపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోతు రాందేవ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులే రాబోయే తరానికి పునాదులని, విద్యార్థులు పట్టుదలతో చదివి వివిధ రంగాలలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు గాయత్రి, ఉపాధ్యాయులు జనగాం భాను, మొహమ్మద్ సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా భూపాలపల్లి అభివృద్ధి

భూపాలపల్లి: నాడు కుగ్రామంగా ఉన్న భూపాలపల్లి, నేడు సింగరేణి గనులతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాగా నిలిచిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రూ.2.06కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.1.40కోట్లతో నిర్మించిన హోంలెస్ సెంటర్(నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం) భవనాలను సోమవారం అదనపు కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి ప్రారంభించారు. అనంతరం కూరగాయల మార్కెట్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం భూపాలపల్లి నడిబొడ్డున చేపలు, చికెన్, మటన్, కూరగాయలతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించుకోవడం సంతోషం కలిగించిందన్నారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు భూపాలపల్లిలో ఏం అభివృద్ధి జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. సింగరేణి సంస్థ వేయి క్వార్టర్లు నిర్మించిందని, అవి సరిపోవడం లేదనే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మరో వేయి క్వార్టర్లు మంజూరు చేయించి ఇటీవలే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకున్నట్లు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలో నలుదిక్కులా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మంజూర్‌నగర్‌లో కూడా రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇక నుంచి రోడ్లపై కూరగాయలు విక్రయించకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణం అభివృద్ధికి సంకేతం అన్నారు. రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో భూపాలపల్లి మూడవ స్థానంలో ఉందన్నారు. . మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్‌చైర్మన్ హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రమేష్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అవినాష్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న మంజుల

వెంకటాపురం(ఎం): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు మంజుల అన్నారు. మండలంలోని నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 10వ తరగతి విద్యార్థులు పాఠశాలలో జరిగిన అనుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధంగా, పట్టుదలతో చదివి రాబోయే బోర్డు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులు దృష్టి సారించాలని అన్నారు. క్రమశిక్షణతో, సత్ప్రవర్తనతో మెలిగి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్, కవిత, విమల, సులోచన, సముద్రాల శ్రీనివాసచార్యులు, యాకయ్య, జగదీష్ పాల్గొన్నారు.

ప్రతీ కూలీకి పని కల్పించండి

కాటారం: ఉపాధిహామీ పథకం ద్వారా అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వివరాలు, కూలీల సంఖ్య, వేతనాల చెల్లింపు, కూలీల బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల నిర్వహణపై పలు సలహాలు చేశారు. మిషన్ అంత్యోదయ ఆన్‌లైన్ యాప్ ద్వారా సర్వే కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సరిత

ఏటూరునాగారం: పోడు భూములకు పట్టాలివ్వాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కొప్పుల సరిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆమె మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నారన్నారు. మంగపేట మండలం పూరేడుపల్లి చెందిన గిరిజనులకు పోడు భూములు రావాలని ఆందోళన చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. కొంత మంది ఆదివాసీ నాయకులు అమ్ముడుపోయి పోడు భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు.